
సాక్షి ఒడిశా

గురువారం । 1 । ఫిబ్రవరి । 2024



**శ్రీమందిరం ఆదాయం లెక్కింపు**

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,66,655లు, బంగారం 1గ్రాము 340 మిల్లీగ్రాములు, వెండి 57 గ్రాములు 300 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



**భాషా సదస్సు విజయవంతం చేద్దాం**

రాష్ట్రంలో తొలిసారిగా ప్రథమ ప్రపంచ ఒడియా భాషా సదస్సు నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమం విజయవంతం చేయాలని ఒడియా భాష, సాహిత్యం, సాంస్కృతిక శాఖ కార్యదర్శి సుజాత రౌత్ కార్తికేయ కోరారు.

-8లో




**పేదల అభ్యున్నతే సీఎం ధ్యేయం**

పేదల అభ్యున్నతే సీఎం నవీన్ పట్నాయక్ ధ్యేయమని 5టీ కార్యదర్శి కార్తికేయ పాండియన్ అన్నారు.

-8లో

## న్యూస్‌రీల్

### అధ్యక్షురాలిగా మీనాక్షి బాహిణీపతి



భువనేశ్వర్/కొరాపుట్: ఒడిశా ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా మీనాక్షి బాహిణీపతి నియమితులయ్యారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆమోదం మేరకు ఈ నియామకం జరిగినట్లు రాష్ట్ర కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఈమె ప్రస్తుతం ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. జయపురం నియోజకవర్గం సిటింగ్ ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి భార్య. గతంలో 2 సార్లు కొరాపుట్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. 2011 నుంచి 2023 వరకు 13 సంవత్సరాల పాటు కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవిని కూడా విజయవంతంగా నిర్వహించారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



ప్రమాద స్థలం వద్ద శాంతిన నాయక్, మృతుడు శబంతులు

రాయగడ: రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు దుర్మరణం పాలయ్యాడు. జిల్లాలోని కాసీపూర్ సమితి శంకరాడ గ్రామ సమీపంలో బుధవారం చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో మృతుడు మైకాంచ్ పంచాయతీలోని కంచుగుమ్మ గ్రామానికి చెందిన శబంతు నాయక్ (30) గా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. కంచుగుమ్మ గ్రామానికి చెందిన శబంతు, శాంతిన నాయక్ (22)లు తమ సొంత ద్విచక్ర వాహనంపై పని మీద బుధవారం రాయగడ వచ్చారు. పనులు ముగించుకుని తిరిగి తమ గ్రామానికి వెళ్తుండగా శంకరడ మలుపు వద్ద ఎదురుగా వస్తున్న టాటా మ్యాజిక్ వాహనం ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొంది. దీంతో వాహనం నడుపుతున్న శబంతు అక్కడిక్కడే ప్రాణాలు పోగొట్టుకోగా స్వల్ప గాయాలతో శాంతిన నాయక్ బయటపడ్డాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఈనెల 4న అఖిలపక్ష సమావేశం

భువనేశ్వర్: శాసనసభ సమావేశాలు పురస్కరించుకొని అఖిల పక్ష సమావేశానికి స్పీకర్ పిలుపునిచ్చారు. ఈనెల 5వ తేదీ నుంచి సమావేశాలు ప్రారంభమవ్వనున్నాయి. ఇవి 16వ శాసనసభ చిట్ట చివరి సమావేశాలు కావడం విశేషం. దీనిలో భాగంగా 4వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు అఖిల పక్ష సమావేశం జరగనుంది. శాసనసభ స్పీకర్ ఛాంబర్‌లో ఈ సమావేశం జరగనుంది. అదేవిధంగా 5వ తేదీ ఉదయం 10.15 గంటలకు అధికార పక్షం బిజూ జనతా దళ్ శాసన సభ్యులు సమావేశం కానున్నారు. ఈ విషయాన్ని అధికార పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ ముదులి తెలియజేశారు. నిర్మాణాత్మక సహకారం మరియు సంప్రదింపుల కోసం ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈనెల 5వ తేదీ నుంచి 13వ తేదీ వరకు అసెంబ్లీ సమావేశాలు కొనసాగనున్నాయి. ఈ సమావేశాల్లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. మొత్తం 7 పనిదినాలతో శాసన సభ సమావేశాలు కార్యక్రమం ఖరారు చేశారు. సమావేశాలు ప్రారంభం పురస్కరించుకుని 5వ తేదీన గవర్నర్ ప్రసంగం చేయనున్నారు. అనంతరం 8వ తేదీన తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అఖిల పక్షాలకు చిట్ట చివరి శాసన సభ సమావేశాలు కీలకం. ఎమ్మెల్యేల ఫొటో సెషన్ చివరి సమావేశాల్లో కొసమెరుపు.

### జాజ్‌పూర్ యూనిట్‌కు అవార్డులు




గెలుచుకున్న క్యూసీఎఫ్ఐ అవార్డులు

భువనేశ్వర్: క్వాలిటీ సర్కిల్స్ ఫోరమ్ ఆఫ్ ఇండియా (క్యూసీఎఫ్ఐ) 3వ జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో సాగర్ సిమెంట్స్ లిమిటెడ్ జాజ్‌పూర్ యూనిట్ 3 అవార్డులు గెలుచుకుంది. పలు వర్గాల్లో సుస్థిరత ప్రామాణికంగా ఎంపిక చేసిన అవార్డులు వచ్చినట్లు జాజ్‌పూర్ యూనిట్ ప్లాంట్ జనరల్ మేనేజర్ జి.ప్రసాద్ బాబు తెలిపారు. ఎనర్జీ ఎక్సలెన్స్, వాటర్ ఎక్సలెన్స్, సేఫ్టీ ఎక్సలెన్స్ వర్గాల్లో జాజ్‌పూర్ యూనిట్‌కు మూడు జాతీయ సుస్థిరత అవార్డులు లభించాయని తెలిపారు.

# వైద్యుల కొరత ▸ నివారణకు చర్యలు

- వైద్య విద్యార్థులకు ప్రభుత్వం షరతు
- ముందస్తు సర్వీస్ బాండ్ అనివార్యం
- రెండేళ్ల పాటు సేవలు వినియోగించుకోవాలని నిర్ణయం



భువనేశ్వర్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల సంక్షోభాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లోని పాసింగ్ అవుట్ వైద్యులను కనీసం 2 ఏళ్ల పాటు వారి సేవలను వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మెడికల్ కోర్సుల్లో ప్రవేశం సమయంలో అభ్యర్థులచే బాండ్ అమలు చేయాలని నిర్ణయించింది. ప్రభుత్వం జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత, పాసింగ్ అవుట్ అయిన వైద్యులను రాష్ట్ర ప్రయోజనాల కోసం వారి సేవలను ఉపయోగించుకునే లక్ష్యంతో ఒక ఒప్పందాన్ని అమలు చేయడానికి ఇప్పటికే ఉన్న విధానాన్ని సవరించినట్లు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రకటన జారీ చేసింది. ఈ నేపథ్యంలో మునుపటి తీర్మానాలు, ఆదేశాలు, కార్యనిర్వాహక సూచనలు, మార్గదర్శకాలు తదనుగుణంగా సవరించబడతాయని తాజా ఉత్తర్వులు స్పష్టం చేశాయి.

**ప్రభుత్వ కళాశాలలకు వర్తింపు**

పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ) డిప్లొమాలో స్టేట్ కోటా లేదా ఆల్ ఇండియా కోటా, నేషనల్ బోర్డ్‌లో డిప్లొమా, డాక్టరేట్ నేషనల్ బోర్డ్ ఎండీ, ఎంఎస్, ఎండీఎస్, డీఎం, ఎంసీహెచ్ వంటి కోర్సులు లేదా ఏదైనా ఇతర కోర్సులు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అడ్మిషన్ తీసుకునే అభ్యర్థులందరికీ ఈ బాండ్ వర్తిస్తుంది. బాండ్ సమర్పించకుండా ఎలాంటి అడ్మిషన్ జరగదు. దీనిని రాష్ట్ర డైరక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ (డీఎంఈటీ) ద్వారా నిర్ధారిస్తారు. పైన పేర్కొన్న కోర్సుల్లో ఏదైనా పూర్తి చేసిన తర్వాత అభ్యర్థులు రాష్ట్రంలో ఏదైనా ఆరోగ్య సంస్థలో 2 ఏళ్ల పాటు సేవలందించాల్సి ఉంటుంది. బాండ్ నిబంధన ప్రకారం 2 ఏళ్ల సర్వీస్ పూర్తయిన తర్వాత తాజా లేదా సర్వీస్‌లో ఉన్న వైద్యులు బాండ్ షరతుల నుంచి విడుదల చేయబడతారు. ఈ నిబంధనతో ఇక నుంచి అభ్యర్థుల సర్టిఫికెట్లు అడ్మిషన్ ప్రక్రియ ముగియడంతో విద్యార్థులకు అందజేస్తారు. ఒక అభ్యర్థి కోర్సు పూర్తయిన వెంటనే ఉన్నత చదువుకు అవకాశం పొందినట్లయితే తాత్కాలిక వెసులుబాటు కల్పించి అనుమతిస్తుంది. అనుబంధ అధ్యయనం నుంచి తిరిగి వచ్చిన తర్వాత బాండు షరతులు, నిబంధనలు, నియమాలు యథాతథంగా అమలులోకి వస్తాయని స్పష్టం చేయడం గమనార్హం. ఈ మేరకు అభ్యర్థులు ముందస్తుగా ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్ట్ (జేఎంఎఫ్‌సీ) ముందు అఫిడవిట్ రూపంలో అంగీకారం సమర్పించాల్సి ఉంటుంది. అభ్యర్థులు ఈ అఫిడవిట్ కాపీని ఆరోగ్య శాఖ డైరెక్టరేట్ మరియు రాష్ట్ర డీఎంఈటీకి పంపాల్సి ఉంటుంది. ఎంసీఐ, ఎన్ఎంసీ ఆమోదించిన ఎంబీబీఎస్, బీడీఎస్ తదనంతర ఉన్నత విద్యాభ్యాసం పోస్ట్ గ్రాడ్యుయేషన్, సూపర్ స్పెషాలిటీ లేదా పోస్ట్ డాక్టరల్ కోర్సులు వంటి కోర్సులకు మాత్రమే వెసులుబాటు వర్తిస్తుంది.

**రాష్ట్ర వెలుపల కోర్సులకు వర్తించదు**

రాష్ట్రం వెలుపల ఎలాంటి రెసిడెన్సీ లేదా ఫెలోషిప్ కోర్సు, ఉన్నత చదువులకు సడలింపు వర్తించదు. రాష్ట్ర వైద్య మండలి (ఓఎంసీ) బాండ్ షరతుల నెరవేర్పుకు సంబంధించి రాష్ట్ర డీఎంఈటీ నుంచి క్లియరెన్స్ పొందితే తప్ప మరే ఇతర రాష్ట్రంలో ఉన్నత చదువుల రిజిస్ట్రేషన్ చేయడానికి ఎన్‌ఓసీ మంజూరు చేయరు. రాష్ట్ర ప్రభుత్వం లేదా ప్రభుత్వ రంగ మెడికల్ కాలేజీల కోసం రెసిడెన్సీ, కాంట్రాక్టు, రెగ్యులర్ ఫ్యాకల్టీల ఎంపిక ప్రక్రియలో పాల్గొనేందుకు అనుమతిస్తారు. ఈ సేవలను (సీనియర్ రెసిడెంట్, ట్యూటర్, మెడికల్ కాలేజీలలో ఫ్యాకల్టీ, వైద్యాధికారులు లేదా ఇతర విభాగాలలో మెడికల్ ఆఫీసర్) బాండ్ పరిధిలో సేవగా పరిగణిస్తారు.

**రాష్ట్ర ప్రభుత్వానికి హక్కు**

ఉద్యోగం ఇచ్చే లేదా తిరస్కరించే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. కోర్సు పూర్తయిన ఆరు నెలల్లోపు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి ఉద్యోగం ఇవ్వనట్లయితే, విద్యార్థులు బాండ్ షరతులు, నిబంధనల నుంచి మినహాయించబడతారు. బాండ్ రద్దు అవుతుంది. ఒడిశా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ (కంట్రోల్ అండ్ రెగ్యులేషన్) చట్టం 1990 కింద రిజిస్టర్ చేయబడిన ప్రైవేట్ హెల్త్ కేర్ ఇన్‌స్టిట్యూషన్‌లు, సంబంధిత వైద్యుల నుంచి ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ముందు ప్రమాణం చేయిస్తే తప్ప, వారు ఏ డాక్టర్‌ను ఎంగేజ్ చేయరు. పోస్టు గ్రాడ్యుయేట్ సర్వీస్ నేపథ్యంలో బాండ్ నిబంధనలకు కట్టుబడి ఎటువంటి ఉల్లంఘనకు పాల్పడలేదని కార్యనిర్వాహక మేజిస్ట్రేట్ అఫిడవిట్ దాఖలు చేయడం అనివార్యంగా ఉత్తర్వులు పేర్కొన్నాయి. ఉల్లంఘనకు పాల్పడితే ఆర్థిక జరిమానా చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కోర్సు పూర్తయిన తర్వాత రెండు సంవత్సరాలు రాష్ట్రంలో పని చేయనందుకు స్టడీ పీరియడ్ సమయంలో అందుకున్న స్టైపెండ్, జీతం కంటే రెట్టింపు జరిమానా చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. కోర్సు పూర్తికాకముందే కోర్సును విడిచిపెట్టిన అభ్యర్థులు రూ.10 లక్షల ఆర్థిక జరిమానా మరియు కోర్సును విడిచిపెట్టిన తేదీ నాటికి అందుకున్న స్టైపెండ్ మరియు జీతం మొత్తం ఫిరాయించాల్సి ఉంటుంది. జరిమానా చెల్లించని పక్షంలో ఒడిశా పబ్లిక్ డిమాండ్ రికవరీ చట్టం 1962 ప్రకారం బాండ్ షరతులను ఉల్లంఘించిన డిఫాల్టర్లపై రికవరీ ప్రక్రియ ప్రారంభించబడుతుంది.

### వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను

- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎమ్మెల్యే నరసింగ మిశ్రా
- తనయుడికి సీటు కోసం ప్రయత్నాలు



నరసింగ మిశ్రా

భువనేశ్వర్: రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎమ్మెల్యే నరసింగ మిశ్రా రానున్న శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయడం లేదని ప్రకటించారు. ఈ నిర్ణయానికి ఆయన కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు. నగరంలో మీడియాతో బుధవారం మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయకూడదనే తుది నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. గతసారి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన తన చిన్న కుమారుడు సమరేంద్ర మిశ్రా ఈసారి బొలంగీర్ శాసన సభ నియోజక వర్గం నుంచి బరిలో ఉంటారని తెలిపారు.

**అధిష్ఠానందే తుది నిర్ణయం**

తన నిర్ణయాన్ని తాను ఏఐసీసీకి తెలియజేశానని, సమరేంద్ర అభ్యర్థిత్వంపై పార్టీయే తుది నిర్ణయం తీసుకుంటుందని నరసింగ మిశ్రా తెలిపారు. తన నియోజకవర్గంలో ఇటీవల 5 సార్లు పార్టీ కార్యకర్తల సమావేశాలు జరిగాయి. బొలంగీర్ నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో సమరేంద్ర పోటీ చేసేందుకు అందరూ సానుకూలంగా ఉన్నారని వెల్లడించారు. అయితే ఏఐసీసీ తుది నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి, రాష్ట్రంలోని వివిధ పార్లమెంటు నియోజకవర్గాలకు తగిన అభ్యర్థుల కోసం అన్వేషణ జరుగుతోందన్నారు. గతేడాది అక్టోబర్‌లో ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనని నరసింగ మిశ్రా తొలిసారి ప్రకటించారు. ఈ ప్రకటనని తాజాగా ఉద్ఘాటించారు. అయితే జిల్లాలో కాంగ్రెస్ అభ్యర్థుల ప్రచారంతోపాటు ఎన్నికల కార్యకలాపాల్లో కాంగ్రెస్‌కు చురుగ్గా మద్దతు ఇస్తానని చెప్పారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బొలంగీర్ నియోజక వర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన సమరేంద్ర మిశ్రా అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) సభ్యుడుగా ఉన్నారు.

## బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ మహాజన్‌కు స్వాగతం పలుకుతున్న అధికారులు



బాధ్యతలు స్వీకరించిన ధీనష్ దస్తగీర్



బాధ్యతలు స్వీకరిస్తున్న జయనారాయణ్ పంకజ్

రాయగడ: జిల్లా కొత్త కలెక్టర్ మరోజ్ సత్యబాన్ మహాజన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. బుధవారం మధ్యాహ్నం రాయగడకు చేరుకున్న ఆయన కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. ఆయనకు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి నిహారి రంజన్ కుహరొ, ఏడీఎం (ఎడ్మినిస్ట్రేషన్) రామేశ్వర్ ప్రధాన్, ఏడీఎం భాస్కర రైతా, డిస్ట్రిట్ అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ అధికారి గౌరాచంద్ గొమాంగో తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

బరంపురం: బరంపురం సబ్ కలెక్టర్‌గా ఐఏఎస్ అధికారి ధీనష్ దస్తగీర్ బరంపురం ఉప జిల్లా పాలన కార్యాలయంలో బుధవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు కార్యాలయంలో పనిచేసే సిబ్బంది పుష్పగుచ్ఛంతో స్వాగం పలికారు.

బరంపురం: దక్షిణాంచల్ రేంజ్ ఐజీగా జయనారాయణ్ పంకజ్ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో బరంపురం ఎస్పీ డా.సర్వాణ్ వివేక్, గంజాం ఎస్పీ జగ్‌మోహన్ మీన తదితరులు పాల్గొన్నారు.

## 42 గ్రాముల బ్రౌన్ సుగర్ సీజ్



జయపురం: బొయిపరిగుడ పోలీసులకు పట్టుబడిన గంజాయి బస్తాలు

- ఇద్దరు నిందితులు అరెస్టు

బరంపురం: నగరంలో రోజురోజుకీ బ్రౌన్ సుగర్ మాఫియా విస్తరిస్తోంది. బుధవారం ఉదయం బరంపురం–గోపాల్‌పూర్ రహదారి మధ్య బరంపురం ఎక్సైజ్ అధికారులు 42 గ్రాముల బ్రౌన్ సుగర్ సీజ్ చేయడం సంచలనంగా మారింది. బరంపురం ఎక్సైజ్ అధికారి రబింద్ర నారాయణ నాయక్ తెలిపిన వివరాల మేరకు.. బీఎన్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధి గోపాల్‌పూర్ రహదారి జంక్షన్‌లో బ్రౌన్ సుగర్ చలామని చేస్తున్నట్లు పోలీసులకు ముందస్తు సమాచారం వచ్చింది. దీంతో ఎక్సైజ్ అధికారి రమేంద్ర నారాయణ నాయక్ నాయకత్వంలో అధికారుల బృందం దాడులు చేసి అక్రమంగా సరఫరా చేస్తున్న 42 గ్రాముల బ్రౌన్ సుగర్ సీజ్ చేసి, ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. అరెస్టైనవారు భరత్ సాహు, నిమాజ్ ఖాన్‌లుగా గుర్తించారు. దీనివిలువ మార్కెట్‌లో రూ.6.40 లక్షలు ఉంటుందని వెల్లడించారు.

**భారీగా గంజాయి పట్టివేత**

అదేవిధంగా బరంపురం రైల్వేస్టేషన్‌లో ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి 10 కిలోల గంజాయి సీజ్ చేసి ఒక నిందితుడిని అరెస్టు చేశారు. అరెస్టైన నిందితుడు కున్నా డకువాగ గుర్తించారు. సీజ్ చేసి గంజాయి విలువ రూ.లక్ష ఉంటుందని అధికారి రబీంద్ర నారాయణ నాయక్ తెలియజేశారు.



బరంపురం: అరెస్టైన నిందితులను చూపిస్తున్న పోలీసులు

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ సమితిలోని ఒక అడవిలో ఇతర ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధం చేసిన గంజాయిని బొయిపరిగుడ పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. అయితే పోలీసులను చూసిన గంజాయి మాఫియా వ్యక్తులు అక్కడ నుంచి పరారయ్యారు. పట్టుబడిన గంజాయి 321 కేజీలు ఉన్నట్లు బుధవారం పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఇతర ప్రాంతాలకు తరలించేందుకు గంజాయి మాఫియ ప్రయత్నిస్తున్న విషయంపై ముందస్తు సమాచారం అందడంతో ఎస్.ఐ.కృష్ణ చంద్ర సెఠి నేతృత్వంలో ఏఎస్ఐ మోతిసింగ్ నాయిక్‌తో పాటు పోలీసుల బృందం దాడులు నిర్వహించింది. దీనిలో భాగంగా బొస్తాగుడ గ్రామ సమీప అడవిలో పెద్ద ఎత్తున గంజాయి పట్టుబడింది.

### పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

- 3 రోజుల పాటు తేలికపాటి వర్ష సూచన

భువనేశ్వర్: రాష్ట్రమంతటా కనిష్ట ఉష్ణోగ్రతల్లో పెరుగుదల కనిపిస్తోంది. గత 24 గంటల్లో రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో పొడి వాతావరణం నెలకొంది. రానున్న మూడు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) బుధవారం మధ్యాహ్నం జారీ చేసిన సమాచారంలో పేర్కొంది. భద్రక్ మరియు అంగుల్ ప్రాంతాల్లో ఒకటి, రెండు చోట్ల దట్టమైన పొగమంచు కమ్మగా, రాష్ట్రం మారుమూల భాగంలో ఒకటి, రెండు చోట్ల తేలికపాటి పొగమంచు కమ్మినట్లు ఈ శాఖ సమాచారం. రాష్ట్రంలోని ఒకటి, రెండు చోట్ల కనిష్ట ఉష్ణోగ్రతలు గణనీయమైన పెరుగుదల నమోదు అయింది. ఇతర ప్రాంతాల్లో పెద్దగా మార్పు లేదు. అత్యధికంగా పర్లాకిమిడిలో గరిష్ట ఉష్ణోగ్రత 33 డిగ్రీల సెల్సియస్, ఫుల్బాణిలో అత్యల్ప కనిష్ట ఉష్ణోగ్రత 11.0 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. కెంజొహర్, మయూర్‌భంజ్, జాజ్‌పూర్, బాలాసోర్, భద్రక్, కేంద్రాపడా మరియు ఢెంకనాల్ జిల్లాల్లో ఒకటి లేదా రెండు చోట్ల రానున్న 3 రోజుల్లో తేలికపాటి వర్షం ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ సమాచారం.

## క్రీడలతో మానసిక ఉల్లాసం



రన్నింగ్ పోటీల్లో చిన్నారులు

రాయగడ: క్రీడలతో విద్యార్థులకు శారీరక, మానసిక ఉల్లాసం లభిస్తుందని కొత్తపేట వద్దనున్న మదర్ థెరిస్సా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు బుద్దా శంకరరావు అన్నారు. ట్రస్టు 17వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని క్రీడా పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై సైతం ఆసక్తి కనబర్చాలని సూచించారు. మదర్ థెరిస్సా ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దేందుకు విశేషంగా కృషి చేస్తున్నామని తెలియజేశారు. ప్రాథమిక విద్య నుంచి పదో తరగతి వరకు ఇక్కడ విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. ట్రస్టు ద్వారా నిరుపేద విద్యార్థులకు ఉచితంగా కొంతమందికి విద్యను అందిస్తున్నామని వివరించారు. ట్రస్టు కార్యదర్శి బి.సంతోష్ కుమార్ మాట్లాడుతూ తమ ట్రస్ట్‌లో పరిసర గ్రామాలకు చెందిన ఎంతోమంది విద్యార్థులు చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తుండడం గర్వకారణమన్నారు. ట్రస్ట్ ప్రిన్సిపాల్ జేసీహెచ్ చౌదరి మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే లక్ష్యాలు చేరుకోగలరని సూచించారు. అంతకుముందు స్థానిక మజ్జిగౌరి మందిరం నుంచి క్రీడా జ్యోతిని తీసుకొచ్చి పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం పోటీలను ప్రారంభించారు.




క్రీడాజ్యోతిని ఊరేగిస్తున్న నిర్వాహకులు

## ఆదివాసీ కళల పరిరక్షణే లక్ష్యం

జయపురం: ఆదివాసీ కళలు, సంస్కృతి పరిరక్షణే పుష్‌పుని వేడుకల ప్రధాన లక్ష్యమని కొరాపుట్ జిల్లా ఆదివాసీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర మఝి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పుష్ పుని ఉత్సవాలు ఆరోరోజు మంగళవారం వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా చంద్రశేఖర మాఝి మాట్లాడుతూ.. ఉత్సవాలు ఆదివాసీ సంస్కృతికి అద్దం పడతాయన్నారు. అంతేకాకుండా కళాకారులకు ఉత్సాహాన్ని, స్ఫూర్తిని ఇచ్చేందుకు ఇటువంటి కార్యక్రమాలు తోడ్పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కొరాపుట్ కళ, కళాకార గ్రూపు అధ్యక్షుడు దిరెన్ మోహన్ పట్నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గౌరవ అతిథిగా వ్యాపారి గెంబలి వసంతరావు, జయపురం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఉపాధ్యక్షుడు అరుగుల శ్రీనివాసరావు, ప్రముఖ డ్రామా డైరెక్టర్ గోపాల సామంతరాయ్, సుధాకర పట్నాయిక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



ఆదివాసీ సంగీతంతో ఉర్రూతలూగిస్తున్న గాయిని



ఆదివాసీ నాటకంలో ఒక సన్నివేశం



ధింసా నృత్య ప్రదర్శన



ఆదివాసీ డ్రామాలో ఒక సన్నివేశం

## క్లుప్తంగా

### తాత్కాలిక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**పార్వతీపురం:** సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా తాత్కాలిక ప్రాతిపదికన భర్తీచేసే పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నిశాంత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడు ఎంట్రీ ఆపరేటర్, ఏడు ఫీల్డ్ సబార్డినేట్ పోస్టులను అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికపై ఎనిమిది నెలల కాలానికి పనిచేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుకు డిగ్రీతోపాటు కంప్యూటర్ నాలెడ్జి ఉండాలని, ఆఫీస్ సబార్డినేట్ పోస్టుకు పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు హెచ్‌టీటీపీ:// పార్వతీపురంమన్యం.ఏపీ.జీవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకుని ఫిబ్రవరి 8వ తేదీలోగా పరిపాలనాధికారి, కలెక్టర్ కార్యాలయానికి నేరుగా, రిజిస్టర్ పోస్టులో పంపించాలన్నారు.

### 24 కేజీల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి నిందితులతో సీఐ ధనుంజయ్‌రావు

**పాచిపెంట:** అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తుల నుంచి 24కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సాలూరు రూరల్ సీఐ ధనుంజయ్‌రావు తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన జత్రాంద్రా కుమార్, రాహీరాజ్‌పుత్, బోలానాథ్‌లు మంగళవారం సాయంత్రం ఒడిశా నుంచి కాలిబాటన పి.కోనవలస చెక్‌పోస్టు మీదుగా గంజాయి తరలిస్తుండగా పాచిపెంట ఎస్సై నారాయణరావు, సిబ్బంది వారిని పట్టుకుని గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

### వన్నాంలో ఏనుగుల గుంపు



వన్నాం పరిసరాల్లో సంచరిస్తున్న గజరాజులు

**కొమరాడ:** మండలంలోని వన్నాం గ్రామ పరిసరాల్లో ఏనుగుల గుంపు సంచరిస్తోంది. గత రెండు రోజులుగా కురుపాం మండలం కిచ్చాడ గ్రామంలో సంచరించిన ఏనుగులు బుధవారం వన్నాం పామాయిల్ తోటల్లోకి చేరాయి. రాత్రి పూట రైతులు పంట పొలాల్లోకి వెళ్లవద్దని అటవీశాఖ అధికారులు సూచించారు.

### 2న ట్రైబల్‌వెల్ఫేర్‌లో పదోన్నతులు

**సీతంపేట:** స్థానిక ఐటీడీఏలో ట్రైబల్‌వెల్ఫేర్ ఆధ్వర్యంలో వివిధ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ఈ నెల 2వ తేదీన పదోన్నతులు కల్పించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. 77 మందికి పదోన్నతులు కల్పించాలని నిర్ణయించగా, అర్హులు 23 మంది ఉన్నట్టు సమాచారం. సీఆర్‌టీలుగా పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయడానికి సంబంధించిన జాబితాలు కూడా తయారు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదించనున్నారు. వారిలో 40 మంది క్వాలిఫైడ్ అభ్యర్థులు ఉన్నట్టు అధికార వర్గాల సమాచారం.

### 17 మంది తహసీల్దార్లకు బదిలీ

**విజయనగరం అర్బన్:** రానున్న సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో ఉమ్మడి విజయనగరం జిల్లాలోని 17 మంది తహసీల్దార్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఇప్పటికే జేసీ కేడర్‌లోని పలువురు ఐఏఎస్‌లకు బదిలీ అయింది. తాజాగా జోన్-1 పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన 137 మంది తహసీల్దార్లను బదిలీచేసింది. వీరిలో 26 మందికి వివిధ కారణాల వల్ల బదిలీ ప్రక్రియ వర్తించకపోగా, 111 మందికి మాత్రమే బదిలీ అయింది. ఉమ్మడి విజయనగరం జిల్లాలో సర్వీస్ మూడేళ్ల పూర్తయినప్పటికీ జూన్ నెలలో ఉద్యోగ విరమణ పొందే ఆరుగురు, సర్వీసు మూడేళ్ల పూర్తి కాని 10 మందికి బదిలీ ఉత్తర్వులు వర్తించలేదు. జిల్లాలో ప్రకృతి వైపరీత్యాల విభాగం డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న సుదర్శనదొర శ్రీకాకుళం జిల్లా కేఆర్‌ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు.

### ఆ మెడికల్ సర్టిఫికెట్ నకిలీదే..

**శ్రీకాకుళం:** జిల్లాలోని డ్వామాలో పనిచేస్తూ ఏడాది కాలంగా సెలవులో ఉన్న ఉద్యోగి సమర్పించిన మెడికల్ సర్టిఫికెట్ నకిలీదేనని రిమ్స్ వైద్యుల బృందం తేల్చిచెప్పింది. ఫోర్జరీ సంతకాలతో మెడికల్ సర్టిఫికెట్లు పేరిట 'సాక్షి'లో ఇటీవల కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా సదరు ఉద్యోగి సమర్పించిన మెడికల్ సర్టిఫికెట్ అసలుదో, నకిలీదో తేల్చాలని డ్వామా అధికారులు రిమ్స్‌కు పంపించారు. విచారణకు ఇద్దరు వైద్యుల బృందం డాక్టర్ ఎల్.ప్రసన్నకుమార్, డాక్టర్ కె.సునీల్‌నాయక్‌లను నియమించారు. సర్టిఫికెట్ సమర్పించిన ఉద్యోగిని పిలిపించి విచారించగా డే అండ్ నైట్ జంక్షన్‌లోని ఓ ప్రైవేట్ మధ్యవర్తి ద్వారా సర్టిపికేట్ పొందాను తప్ప వైద్యుడిని కలవలేదని బృందం వద్ద అంగీకరించాడు. సర్టిఫికెట్ జారీ చేసిన వైద్యుడు 15 ఏళ్ల క్రితమే బదిలీ అయ్యారని, సర్టిఫికెట్‌లో ఉన్న జాబ్ రిజిస్టర్ నంబర్‌కూడా ఆయనది కాదని బృందం నివేదికలో పేర్కొన్నారు. డే అండ్ నైట్ జంక్షన్‌లో ఎవరు ఇటువంటి సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారో వెలుగులోకి వస్తుందని విచారణ అధికారులు 'సాక్షి'తో పేర్కొన్నారు.





## పూల సోయగం..!

జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరిలో ఉన్నటువంటి ఆదిత్య బిర్లా గ్రూప్ సంస్థలకు చెందిన ఉత్కళ అలూమిన కర్మాగారం ప్రాంగణంలో నిర్వహించిన పుష్ప ప్రదర్శన కనువిందు చేసింది. కర్మాగారం యూనిట్ హెడ్ మజూర్ బేగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రదర్శనకు ముఖ్య అతిథిగా దక్షిణాంచల్ డీఐజీ చరణ్ సింగ్ మీనా హాజరయ్యారు. ప్రదర్శనలో 22 రకాల సీజనల్ పూలతో పాటు 15 రకాల ఇండోర్ మొక్కలు, మరో పది రకాల సక్యూలెంట్స్, 20 రకాల బోన్సాయి మొక్కలు ప్రత్యేకంగా నిలిచాయి. పుష్ప ప్రదర్శనను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివస్తున్నారు. – రాయగడ



## భాషా సదస్సు విజయవంతం చేద్దాం

- ఒడియా భాష సాంస్కృతిక శాఖ కార్యదర్శి సుజాత రౌత్



మాట్లాడుతున్న సుజాత కార్తికేయ

**భువనేశ్వర్:** రాష్ట్రంలో తొలిసారిగా ప్రథమ ప్రపంచ ఒడియా భాషా సదస్సు నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థించింది. ఈ సదస్సు ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభమై 3 రోజులపాటు కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఒడియా భాష, సాహిత్యం, సాంస్కృతిక శాఖ కార్యదర్శి సుజాత రౌత్ కార్తికేయ మాట్లాడారు. సదస్సు ప్రారంభం పురస్కరించుకుని ఈనెల 3వ తేదీ ఉదయం 11.30 గంటలకు వందే ఉత్కళ జనని రాష్ట్ర గీతాన్ని ఆలపించాలని అభ్యర్థించారు. ప్రథమ ప్రపంచ ఒడియా భాషా సమ్మేళనం గురించి వివరాలను ఆమె వివరించారు. సదస్సులో భాగంగా ఒడియా భాషకు యువతరాన్ని అనుసంధానించే పలు ప్రణాళికలు ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు.

**వందే ఉత్కళ జనని ఆలాపన**

ప్రపంచ ఒడియా భాషా సమ్మేళనం ప్రారంభం పురస్కరించుకుని ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన ఒడియా ప్రజలు ఈనెల 3న ఉదయం 11.30 గంటలకు వందే ఉత్కళ జనని రాష్ట్ర గీతం ఆలపించాలని కోరారు. ఒడియా భాష ప్రాచీనత, కొనసాగింపు పోకడలో పలు మైలు రాయి ఘట్టాలను కళ్లకు కట్టినట్లు పలు ప్రదర్శనలు, చర్చలు చోటు చేసుకుంటాయన్నారు. ఒడియా భారతదేశంలోని 6 శాస్త్రీయ భాషలలో ఒకటి. ఒడియా భాష, సాహిత్యం, సాంస్కృతిక వారసత్వానికి సంబంధించిన వివిధ అంశాలపై 16 వర్గాల కింద సదస్సు కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో శ్రీజగన్నాథ్ చైతన్యం శీర్షిక చోటు చేసుకుంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈనెల 4వ తేదీన ఉత్కళ గౌరవ్ మధుసూదన్ దాస్‌కు ప్రత్యేక నివాళులర్పిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని విభాగాలు, వాటాదారులు, సంస్థలు, వ్యక్తులు, కార్యకర్తలు కలిసికట్టుగా ప్రపంచ ఒడియా భాష సదస్సు విజయవంతం చేయాలని అభ్యర్థించారు. దేశం లోపల, వెలుపల నివసిస్తున్న ఒడియా ప్రజలంతా సమగ్ర ఒడిశా పారిబార్ (ఒడిశా పరివారం) ఈ సదస్సుని చిరస్మరణీయమైనదిగా మలిచేందుకు సహృదయంతో స్పందించాలని పిలుపునిచ్చారు.

## పేదల అభ్యున్నతే సీఎం ధ్యేయం



విద్యార్థులతో కరచాలనం చేస్తున్న పాండియన్

**బరంపురం:** పేదల అభ్యున్నతే సీఎం నవీన్ పట్నాయక్ ధ్యేయమని 5టీ కార్యదర్శి కార్తికేయ పాండియన్ అన్నారు. నగరంలోని అంబపువ పోలీసు రిజర్వ్ మైదానంలో మో ఒడిశా- యువ నవీన్ ఒడిశా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాండియన్ మాట్లాడుతూ.. యువత అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందినట్లని పేర్కొన్నారు. దేశంలో మొదటిసారిగా మన రాష్ట్రంలోనే బస్తీ వాసులు 2,000 వేల మందికి భూమి అధికారి పట్టాలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. గంజాం జిల్లాలోని 157 కళాశాలలు, పాఠశాలల అభివృద్ధి కోసం రూ. 180 కోట్ల నిధులు విడుదల చేసినట్లు తెలిపారు.




మాట్లాడుతున్న కార్తికేయ పాండియన్

కార్యక్రమంలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

## సముద్ర తాబేళ్ల మృత్యుఘోష



తాబేళ్ల కళేబరాలు



తాబేళ్ల కళేబరాలు

- శ్రీకాకుళం రూరల్ ప్రాంత బీచ్‌లలో వందలాది కళేబరాలు
- రక్షణ కల్పించాలంటున్న స్థానికులు

**శ్రీకాకుళం రూరల్ :** కూర్మనాథుడి ప్రతిరూపంగా భావించే తాబేళ్లు పెద్ద ఎత్తున మృత్యువాతపడుతున్నాయి. శ్రీకాకుళం రూరల్ మండలం పరిధిలోని కుందువానిపేట, పెదగనగళ్లపేట బీచ్ తీరంలో అడుగడుగునా సముద్రతాబేళ్ల మృత కళేబరాలే దర్శనమిస్తున్నాయి. బీచ్ వెంబడి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు, పర్యాటకులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి తాబేళ్ల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని తీర ప్రాంతవాసులు కోరుతున్నారు.

### జిల్లాకు కొత్త అదనపు ఎస్పీలు

**శ్రీకాకుళం క్రైమ్ :** జిల్లా పోలీసు శాఖకు సంబంధించి కొత్త అదనపు ఎస్పీలు రానున్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్‌కుమార్ గుప్తా ఉత్తర్వులు వెలువరించారు. కాకినాడ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అటాచ్డ్ విశాఖపట్నం కమిషనర్ ఆఫ్ పోలీసు కార్యాలయం నుంచి డాక్టర్ ప్రేమ్ కాజల్ శ్రీకాకుళం అడ్మిన్ విభాగానికి అదనపు ఎస్పీగా రానున్నారు. ఏలూరు ఎస్సీ ఎస్టీ సెల్, ఏసీబీ అదనపు ఎస్పీగా ఉన్న బి.ఉమామహేశ్వరరావు శ్రీకాకుళం క్రైమ్ విభాగానికి అదనపు ఎస్పీగా వస్తున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న అదనపు ఎస్పీలు జె.తిప్పేస్వామి (అడ్మిన్) టి.పి.విఠలేశ్వరరావు (క్రైమ్)లు ఆంధ్రప్రదేశ్ పోలీస్ అకాడమీ, ఏసీబీ అదనపు ఎస్పీలుగా బదిలీపై వెళ్లిపోతున్నారు.

### ఈవీఎం గోదాముల తనిఖీ



గోదాములను తనిఖీ చేస్తున్న కలెక్టర్

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాములను కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ బుధవారం తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఈవీఎంలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం జిల్లాలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో భద్రతా చర్యలపై సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ బి.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

### ఓటర్ల జాబితా సవరణకు 10,304 దరఖాస్తులు

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** ఓటర్ల జాబితాలో పేరు, చిరునామా తదితర సవరణల కోసం ఇప్పటివరకు 10,304 దరఖాస్తులు వచ్చాయని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల సవరణ జాబితా (ఎస్ఎస్ఆర్-2024)లో ఏమైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. తాజాగా వచ్చిన ఫారం 6, 7, 8లను పరిశీలించి సప్లిమెంటరీ ఓటరు జాబితాలో చేరుస్తామన్నారు. కొత్తగా ఓటు నమోదు కోసం గత వారం 1583 మంది సంప్రదించారని పేర్కొన్నారు. డిసెంబర్ 12 నుంచి ఇప్పటి వరకూ 12,267 మంది కొత్త ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. చిరునామా, పేరు, ఇతర సవరణలు కోరుతూ 10,304 మంది దరఖాస్తు చేసుకోగా అందులో 454 తిరస్కరించామని, 4424 పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు రౌతు శంకరరావు, కె.వి.రామరాజు, దేసెళ్ల మల్లిబాబు, సోమేశ్వరరావు, సురేష్ బాబు సింగ్, సెక్షన్ సూపరింటెండెంట్ ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

## ప్రైవేటు బస్సు యాజమాన్య సంఘం ఎన్నిక



సమావేశంలో పాల్గొన్న సంఘం సభ్యులు

**పర్లాకిమిడి:** గజపతి జిల్లా యునైటెడ్ ప్రైవేటు బస్సు యాజమాన్య సంఘం 3వ వార్షికోత్సవ సభ, సాధారణ కార్యవర్గ సమావేశం స్థానిక పీడబ్ల్యూడీ బంగ్లాలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలో ప్రైవేటు బస్సు యాజమాన్య సంఘం ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు సంఘం కార్యదర్శి ఇంజా వెంకటరమణ సభ్యులకు తెలియజేశారు. ఈ సందర్భంగా 2024-25 వార్షిక సంవత్సరానికి యునైటెడ్ ప్రైవేటు బస్సు యాజమాన్య సంఘం కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా ప్రైవేటు బస్సు యాజమాన్య సంఘం కొత్త అధ్యక్షుడిగా ఛిత్రి సింహాద్రి మూడోసారి ఎన్నికైనట్లు ప్రకటించారు. కార్యదర్శిగా ఇంజా వెంకటరమణ, సంయుక్త కార్యదర్శిగా కున్నా పట్నాయక్, ఉపాధ్యక్షుడిగా డి.ఆర్.గజపతి రాజు, కె.యుగంధర్, కోశాధికారులుగా పి.రాంబాబు, గణేష్ సాహుకార్‌లు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా కిలారి గోపాలకృష్ణ, శ్రీను సాహుకార్, పి.గోవింద తదితరులు ఏకగ్రీవ సభ్యులుగా ఎన్నుకున్నారు.

## సిమెంట్ ఇటుక పడి బాలిక దుర్మరణం



చిన్నారి రశ్మి మృతదేహం

**జయపురం:** సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితి మహులి గ్రామ పంచాయతీ గుంజ గ్రామంలో విషాదకర ఘటన బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బలరాం కిరసాని అనే వ్యక్తి తన ఇంట్లో మరుగుదొడ్డి నిర్మించేందుకు ఇసుక, సిమెంట్ ఇటుకలు, సిమెంట్ తీసుకొచ్చి ఉంచాడు. అయితే ఈతని కుమార్తె రశ్మి కిరసాని(5) తన స్నేహితులతో ఇటుకలు ఉన్న ప్రాంతంలో బుధవారం ఆడుకుంది. ఆ సమయంలో ఇటుక బాలిక తలపై పడడంతో సంఘటన స్థలం వద్దనే సొమ్మసిల్లి పడిపోయింది. దీంతో చిన్నారితో ఆడుతున్నవారు విషయాన్ని బలరాంకు తెలియజేశారు. వెంటనే బలరాం, అతడి బంధువులు చిన్నారిని బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే పరీక్షించిన వైద్యులు అప్పటికే రశ్మి మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.

## లోయలో పడిన ద్విచక్ర వాహనం

- నలుగురికి గాయాలు



లోయలో పడిపోయిన యువకులు

**రాయగడ:** ఒకే బైకుపై నలుగురు యువకులు ప్రయాణిస్తుండగా అదుపుతప్పి సుమారు 50 అడుగుల లోయలో పడిపోవడంతో తీవ్రగాయలకు గురయ్యారు. జిల్లాలోని దుర్గాపాడు ఘాటీ రోడ్డు వద్ద బుధవారం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. గాయపడిన వారిలో కొడాపాడు గ్రామానికి చెందిన బ్రజేంద్ర కొండగిరి (29), జిల్నా మండంగి (23), మహేంద్ర మండంగి(21)లు ఉండగా, మరో యువకుడు రాయగడకు చెందిన వ్యక్తిగా సమాచారం. మీరావలి గ్రామం నుంచి కొడాపాడు గ్రామానికి బైకుపై వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఏటీఎంలో లూటీ



దగ్ధమైన ఏటీఎం

**కొరాపుట్:** నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో ఏటీఎం లూటీ జరిగింది. బుధవారం వేకువజామున బ్లాక్ కార్యాలయం ముందు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం లక్ష్యంగా దొంగతనం జరిగింది. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ముసుగులు ధరించి ఒక కారులో ఏటీఎంలో చొరబడ్డారు. వెనువెంటనే సీసీ కెమేరాలకి రంగు స్ప్రే కొట్టి కనిపించకుండా చేశారు. తాము తీసుకొచ్చిన గ్యాస్ కట్టర్లు వినియోగించి డబ్బును దొంగలించారు. అయితే గ్యాస్ కట్టర్ల వలన నిప్పులు చెలరేగి కొంత నగదు దగ్ధమయ్యింది. అప్పటికే సేఫ్టీ అలారం మోగడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. సంఘటన స్థలానికి చేరుకునేలోపే నగదుతో దొంగలు పరారయ్యారు. జిల్లా ఎస్పీ రోహిత్ వర్మ సంఘటన స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. జిల్లావ్యాప్తంగా సోదాలు నిర్వహించారు. దీంతో దొంగలు పరారయ్యేందుకు చేసే ప్రయత్నాలు విఫలమయ్యాయి. జిల్లా కేంద్రానికి 30 కి.మీ దూరంలో ఉన్న డాబుగాం ప్రాంతంలో అడవిలో ఒక గుర్తు తెలియని కారు ఉందని, అందులో అపరిచిత వ్యక్తులు ఉన్నారని గిరిజనులు గుర్తించారు. ఈ సమాచారం విన్న పోలీసులు బలగాలు ఆ ప్రాంతం చుట్టుముట్టి కొందరిని అదుపులోకి తీసుకున్నారు. అయితే ఈ విషయం ధ్రువీకరించిన ఎస్పీ వివరణ ఇస్తూ స్వాధీనమైన డబ్బు లెక్కింపు జరుగుతుందని పేర్కొన్నారు. నిందితుల వివరాలు త్వరలో వెల్లడిస్తామని పేర్కొన్నారు.

## జగన్నాథ మందిరం ప్రతిష్ట



ప్రతిష్టోత్సవంలో పాల్గొన్న హోం మంత్రి తుషార్ కాంతి బెహరా తదితరులు

**కొరాపుట్:** జిల్లాలోని దశమంత్‌పూర్ సమితి కేంద్రంలో జగన్నాథ దేవాలయ ప్రతిష్ట బుధవారం ఘనంగా జరిగింది. బుధవారం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ అతిథిగా హోం మంత్రి తుషార్ కాంతి బెహరా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ జిన్ను హిక్కా, లక్ష్మీపూర్ ఎమ్మెల్యే ప్రభుజానీ, కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం పొడాల్, మాజీ ఎమ్మెల్యే కైలాష్ కులసిక, కొరాపుట్ జిల్లా స్వతంత్ర మండలి అధ్యక్షుడు చంద్రశేఖర్ మజ్జి తదితరులు పాల్గొన్నారు.

# సాగుదారుకు సాయం

- రైతన్నకు అండగా నిలుస్తున్న ప్రభుత్వం
- ఈ క్రాప్‌లో సాగుచేసిన పంట వివరాలు
- రబీలో జోరుగా సాగుతున్న నమోదు
- ఇప్పటికే 87శాతం పూర్తి
- ఈ క్రాప్ ఆధారంగా రైతులకు ప్రభుత్వ పథకాల వర్తింపు


విజయనగరం మండలం గుంకలాంలో అపరాలకు ఈ-పంట నమోదు చేస్తున్న వీఏఏ

**విజయనగరం ఫోర్ట్:** రైతన్నకు అన్ని విధాలా జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. రైతులకు అవసరమైన పూర్తిసహాయాన్ని అందిస్తూ సాగు పట్ల ఆసక్తి చూపేలా చర్యలు తీసుకుంటోంది. గతంలో రబీలో పంటలసాగు అంతంత మాత్రంగానే ఉండేది. పంటల సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ప్రభుత్వం అందిస్తుండడమే కాకుండా సాగు పెట్టుబడికి వైఎస్సార్ రైతు భరోసా కింద ఏటా రూ. 13,500 ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. అన్ని విధాలా ప్రభుత్వం సాయం అందించడంతో రైతులు ఖరీఫ్, రబీల్లో పంటల సాగు పట్ల ఆసక్తి కనబరుస్తున్నారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ-క్రాప్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఈ-క్రాప్ నమోదు వల్ల ఏ పంట ఎంత విస్తీర్ణంలో సాగైంది? ఎంత మంది రైతులు సాగు చేశారన్న లెక్కలు కచ్చితంగా తెలుస్తాయి. అర్హులైన రైతులకు మాత్రమే ప్రభుత్వం అందించే పథకాలు, పంట నష్టం జరిగినప్పుడు వచ్చే పరిహారం అందుతుంది.

### ఈ-క్రాప్‌తో విక్రయావకాశం


నేను మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాను. ఖరీఫ్‌లో వరి పంట, రబీలో అపరాలు సాగు చేస్తాను. ఈరెండు సీజన్‌లలోను రైతు భరోసా కేంద్రం సిబ్బంది ఈ- పంట నమోదు చేస్తున్నారు. ఈ-పంట నమోదు వల్ల పంట అమ్ముకోవడానికి అవకాశం ఉంటుంది.

మాసాడ ప్రసాద్, రైతు, పినవేమలి గ్రామం, విజయనగరం మండలం

### ఈ-పంట నమోదు ఆధారంగా బీమా చెల్లింపు

ఈ-పంట ఆధారంగానే ప్రభుత్వం పంటల బీమాను చెల్లిస్తోంది. వర్షాభావ పరిస్థితుల వల్ల పంటనష్టం జరిగినప్పుడు ఈ-క్రాప్ ఆధారంగా పంటల బీమాను ప్రభుత్వం అందజేస్తుంది. గత టీడీపీ ప్రభుత్వం హయంలో పంటలబీమా సకాలంలో చెల్లించేవారు కాదు. పంటనష్టం జరిగిన ఏడాదికి గాని బీమా బాధిత రైతుకు అందేది కాదు. అంతే కాకుండా పంటల బీమా ప్రీమియాన్ని కూడా గతంలో రైతులే చెల్లించేవారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం పంటల బీమా ప్రీమియాన్ని రైతుల తరపున చెల్లిస్తోంది. పంటలబీమాను కూడా పంటనష్టం జరిగిన నెల, రెండునెలల్లోనే విడుదల చేస్తోంది.

### అర్హులకే పథకాలు


ఈ-క్రాప్ నమోదు వల్ల అర్హులైన రైతులకే ప్రభుత్వం అందించే పథకాలు అందుతాయి. పంటల సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, ప్రభుత్వం అందిస్తోంది. సాగుపెట్టుబడికి ఏటా రూ. 13,500 సాయం విడుదల చేస్తోంది. దీని వల్ల సాగుచేయడానికి ఎటువంటి ఇబ్బంది లేదు.

సిరపురపు, రాముునాయుడు, పెదవేమలి గ్రామం, గంట్యాడ మండలం

### రబీలో జోరుగా ఈ-పంట నమోదు

రబీలో సాగైన పంటలకు ఈ-క్రాప్ నమోదు జోరుగా సాగుతోంది. ఈ క్రాప్ నమోదుకు ఇంకా సమయం ఉన్నప్పటికీ ఇప్పటికే 87 శాతం పూర్తయింది. విజయనగరం జిల్లాలో 84,196 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. అందులో వరి పంట 295 ఎకరాలు, మినుము 27, 346, జొన్న 32, పెసలు 10,214, మొక్కజొన్న 30,001, ఇతర పంటలు 4.957 ఎకరాలకు ఈ క్రాప్ నమోదు పూర్తయింది. ఫిబ్రవరి 15వతేదీ వరకు ఈ క్రాప్ నమోదుకు అవకాశం ఉన్నప్పటికీ వ్యవసాయ సిబ్బంది జోరుగా చేయడం వల్ల ఇప్పటికే 87 శాతం నమోదు పూర్తయింది.

### 87 శాతం పూర్తయిన ఈక్రాప్

జిల్లాలో రబీ సాగు ఈ-క్రాప్ నమోదు 87 శాతం పూర్తయింది. ఫిబ్రవరి 15వతేదీ వరకు ఈ-క్రాప్ నమోదు చేసుకోవడానికి సమయం ఉంది. గడువులోగా శతశాతం పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటాం. ప్రతి రైతు ఈ-పంట నమోదు చేసుకోవాలి.

వి. తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

## క్లుప్తంగా

### కేన్సర్‌పై అవగాహన కల్పించండి

- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

**విజయనగరం ఫోర్ట్:** కేన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు కోరారు. ఈ మేరకు ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ వారు కేన్సర్‌పై రుపొందించిన కరపత్రాలను స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేన్సర్ గురించి తెలుసుకోవడం సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. కేన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే నివారణ సాధ్యమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు రామయ్య పంతులు, మూర్తి, రాజు, ప్రసాద్ ఈశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

### చిట్టంపాడులో ఐటీడీఏ పీఓ

- గిరిజనుల సమస్యలపై ఆరా


చిట్టంపాడులో గిరిజనులతో మాట్లాడుతున్న పీఓ విష్ణుచరణ్

**శృంగవరపుకోట:** మండలంలో బొడ్డవర పంచాయతీ పరిధి గిరిశిఖర గ్రామమైన చిట్టంపాడును పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. గిరిజనులతో మాట్లాడి వారి ఇబ్బందులు, సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ రోడ్డు వేయించాలి. విశాఖ కేజీహెచ్, విజయనగరం కేంద్రాస్పత్రిలో ఉచితంగా మందులు ఇచ్చేలా చూడాలి. తమ గ్రామాన్ని ఐటీడీఏ పరిధిలో చేర్చాలి. అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయాలి. తమ ప్రాంతంలో జీడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై పీఓ విష్ణుచరణ్ స్పందిస్తూ రూ.11కోట్ల అంచనా వ్యయంతో 10.4కి.మీ మేర పీఎం జన్‌మన్ కార్యక్రమంలో రోడ్డు మంజూరు చేశామని చెప్పారు. కేజీహెచ్‌లో మందులు అందేలా ఎస్టీ సెల్ నుంచి సహకారం అందిస్తామని, ఆశ వర్కర్ల నియామకం చేపడతామని, పోడు పట్టాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. జీడి కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు పరిశీలన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా గిరిజన సంక్షేమాధికారి టి.చంద్రశేఖర్, ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.శివకుమార్, ఎంపీడీవో శేషుబాబు, రెవెన్యూ ఉద్యోగులు, గిరిజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య


ఉరి వేసుకున్న గౌరీశంకర్

**విజయనగరం క్రైమ్:** స్థానిక కంటోన్మెంట్ ప్రాంతంలోని ఎల్‌బీ కాలనీలో నివాసం ఉంటున్న నరవ గౌరీశంకర్ (38) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం జరిగిన ఈ సంఘటనపై వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మద్యానికి బానిసైన గౌరీశంకర్, భార్య నాగమణి మధ్య ఏర్పడిన మనస్పర్థలతో గతంలో మద్యం తాగవద్దని భార్య చెప్పినందుకు కత్తితో చేతిని కోసుకున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం భార్య నాగమణి చెప్పుల షాప్‌కు వెళ్లింది. మృతుని తల్లి మనుమలకు క్యారేజీ పట్టుకుని స్కూల్‌కు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసిన గౌరీశంకర్ సీలింగ్ ఫ్యాన్‌కు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాలప్పడ్డాడు. గౌరీశంకర్ పెయింటర్‌గా పనిచేసేవాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుని తండ్రి కృష్ణ ఫిర్యాదు మేరకు ఎస్సై నరేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ప్రకృతి సేద్యం లాభదాయకం


ప్రకృతి సేద్యంలో సాగుచేసిన పంటలను పరిశీలిస్తున్న గుజరాత్ బృంద సభ్యులు

**శృంగవరపుకోట:** ప్రకృతి సేద్యం లాభదాయకమని డీపీఎం ఆనంద్ తెలిపారు. వీలుపర్తి గ్రామ రైతులు ప్రకృతి సేద్యం విధానంలో సాగుచేస్తున్న పంటలను గుజరాత్ రాష్ట్రానికి చెందిన ఉద్ధాన్ ఎన్‌జీఓ బృంద సభ్యులు బుధవారం పరిశీలించారు. వారికి ఆర్‌టీఎల్ ప్రకాశ్, ఆర్‌టీఓ హేమసుందర్‌లు ప్రకృతి సేద్య పద్ధతులను వివరించారు. అపరాలు, అంతరపంటలు, ఆకుకూరలు సాగులో అనుసరిస్తున్న విధానాలు, కషాయాల తయారీ, వినియోగం తదితర అంశాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఏడీఏ ఎల్.విజయ, ఎం.ఎ.ఒ.యశ్వంత్‌కుమార్, వేపాడ మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, సర్పంచ్ ఎస్.అప్పారావు, గోకాడ సత్యంనాయుడు పాల్గొన్నారు.

## ప్రాంతీయ జాబ్‌మేళాకు భారీ స్పందన

- రెండేళ్లలో యువతకు భారీగా ఉద్యోగావకాశాలు: కలెక్టర్ నాగలక్ష్మి
- నాణ్యమైన చదువులు, ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం
- రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎం.డి డాక్టర్ వినోద్‌కుమార్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎం.డి వినోద్‌కుమార్, కలెక్టర్ నాగలక్ష్మి

**విజయనగరం అర్బన్:** వచ్చే రెండేళ్లలో జిల్లా యువతకు కనీసం పదివేల నుంచి ఇరవై వేల కొత్త ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి చెప్పారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం 2026 నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని, ఈ ప్రాజెక్టు ద్వారా సేవారంగంలో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. దీంతో పాటు కొత్తవలస సమీపంలో త్వరలో వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో వస్తున్న జిందాల్ పారిశ్రామిక పార్కు ద్వారా కూడా ఉద్యోగావకాశాలు పెరుగుతాయన్నారు. యువత ఏదైనా ఉద్యోగంలో చేరినప్పుడు అందులోనే సరిపెట్టుకోకుండా ఆ ఉద్యోగంలో సంపాదించిన అనుభవం, సాధించిన నైపుణ్యంతో మరింత ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించే ప్రయత్నం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం జరిగిన ప్రాంతీయ జాబ్ మేళాను సంస్థ ఎం.డి డాక్టర్ వి.వినోద్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఆరు జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున ఈ జాబ్‌మేళాలో పాల్గొనగా కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఉన్న డాక్టర్ రెడ్డీస్, అరబిందో ఫార్మా, హెటిరో వంటి 87 సంస్థలు జాబ్‌మేళాలో పాల్గొంటున్నాయని చెప్పారు. జిల్లాలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 9 స్కిల్ కళాశాలల ద్వారా అవసరమైన వారందరికీ నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు నియోజకవర్గ స్థాయిలో 14 జాబ్‌మేళాలు నిర్వహించి 2,600 మంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు.

### అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకోవాలి

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎం.డి డాక్టర్ వి.వినోద్ కుమార్ మాట్లాడుతూ యువత ఏపీ స్కిల్ యూనివర్సల్ అప్లికేషన్‌ను తమ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకుని అందులో వివరాలను నమోదు చేసుకోవడం ద్వారా ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని సూచించారు. నమోదు చేసిన వివరాలతో ఆ యాప్‌లోనే రెజ్యూమె తయారవుతుందని దీంతో పాటు ఆయా యువతీ యువకులు ఏ రంగంలో శిక్షణ పొందాలని భావిస్తున్నారో తెలియజేస్తే వారు నివసిస్తున్న ప్రాంతానికి సమీపంలో సంబంధిత శిక్షణ ఇస్తున్న సంస్థను తెలియజేసి అక్కడ శిక్షణ పొందేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. అనంతరం అభ్యర్థులకు ప్రాంగణంలో కేటాయించిన గదులలో ఎంపిక ప్రక్రియను సంబంధిత సంస్థల హెచ్‌ఆర్ అధికారులు నిర్వహించారు. కార్యక్రమంలో సీతం కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ డాక్టర్ ఎస్.గోవిందరావు, వివిధ శాఖల సహాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రాంతీయ జాబ్ మేళాలో 1,624 మందికి ఉపాధి


నియామక పత్రాలతో అభ్యర్థులు

**విజయనగరం అర్బన్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ స్థానిక గాజులరేగలోని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ప్రాంతీయ మెగా జాబ్ మేళాలో 1,624 మందికి ఉపాధి లభించింది. ఎంపిక ప్రక్రియ అనంతరం జరిగిన కార్యక్రమంలో వారికి నియామక పత్రాలను సీతం ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్, మాజీ ఎంపీ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి అందజేశారు. జాబ్ మేళాకు హాజరైన 5,274 మందిని ఇంటర్వ్యూ చే యగా 1,624 మంది వివిధ కంపెనీలలో ఎంపికయ్యారు. మరో 646 మంది తుది రౌండ్ కోసం ఎంపికయ్యారని జాబ్‌మేళా నిర్వాహకులు ప్రకటించారు.

## అదుపులో మలేరియా

- డీఎంఓ డా.టి.జగన్‌మోహన్‌రావు
- జ్వరంతో చిన్నారి మృతిపై ఆరా


వైద్య శిబిరంలో తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

**కొమరాడ:** గ్రామాల్లో మలేరియా జ్వరాలు అదుపుల్లో ఉన్నాయని గిరిశిఖర గ్రామల్లో ఎలాంటి మలేరియా కేసు నమోదు కావడం లేదని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన కొమరాడ మండలంలోని చోళ్లపధం పంచాయతీ రెబ్బ గ్రామలో చిన్నారి నైనిక మృతిపై ఆరా తీశారు. అనంతరం వైద్యసిబ్బందితో కలిసి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు మలేరియాతో పాటు పలు రకాలు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక వైద్యుడు బి.శామ్యూల్ సిబ్బంది పాల్గొన్నారు.

## యువతి ఆత్మహత్యా యత్నం


నీలకంఠాపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువతి

**కురుపాం:** మండలంలోని టొంపలపాడు సచివాలయం పరిధిలో గేదెలగూడ గ్రామానికి చెందిన యువతి ఆరిక రావియ్య బుధవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యా యత్నం చేసింది. గడ్డి మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్న యువతిని గుర్తించిన కుటుంబసభ్యులు హుటాహుటిన నీలకంఠాపురం పీహెచ్‌సీకి తరలించగా వైద్యాధికారి అభినవ్ ప్రాథమిక వైద్యసేవలు అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం భద్రగిరి సీహెచ్‌సీకి రిఫర్ చేయగా అక్కడ చికిత్స పొందుతోంది. యువతి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

## 2,3 తేదీల్లో పర్యావరణ, మానవతా విలువల పరీక్షలు

**రాజాం సిటీ:** ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫిబ్రవరి 2, 3 తేదీల్లో పర్యావరణ విద్య, మానవతా విలువలకు సంబంధించిన పరీక్షలు జరగనున్నాయని ఆర్‌ఐఓ ఎం.ఆదినారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 20,630 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. పరీక్ష ఫీజు చెల్లించిన వారందరూ ఆయా కళాశాలలో జరిగే పరీక్షలకు విధిగా హాజరు కావాలని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత ప్రిన్సిపాళ్లదేనని, పరీక్ష అయిన వెంటనే మార్కులను ఆన్‌లైన్‌లో పోస్టింగ్ చేయాలని సూచించారు.

## అప్రమత్తతతో అగ్నిప్రమాదాల నివారణ



సమావేశంలో అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ ప్రసాదరావు

- డీడీఆర్ఎఫ్ రామ్‌ప్రకాశ్

**బొండపల్లి:** అప్రమత్తతో అగ్ని ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చని అగ్నిమాపక శాఖ జిల్లా డీడీఆర్ఎఫ్ బీవీవీఎస్ రామ్‌ప్రకాశ్ అన్నారు. మండలంలోని కెరటాం గ్రామంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) వేసిన పైప్‌లైన్ వద్ద అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తెలంగాణా నుంచి ఒడిశాలోని పారాదీప్ వరకు మూడు రాష్ట్రాల మీదుగా పైపులైన్ ద్వారా ఆయిల్ సరఫరా అవుతోందన్నారు. పైపులైన్ల లీకేజీలు, అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రమాదాల నుంచి బయటపడే మార్గాలను తెలియజేశారు. ప్రమాదం జరిగిన వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 18004252159కు డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీఎఫ్ సోమేశ్వరరావు, తహసీల్దార్ డీజీఎంఎస్ ప్రసాదరావు, ఎస్సై కె.లక్ష్మణరావు, సహాయ అగ్నిమాపక అధికారి కె.ఎస్.సంతోష్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి జి.శివ రామరాజు వర్మ, నాయకులు నెట్టి ముకుంద, ఐఓసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

## వన్నాంలో ఏనుగుల గుంపు

**కొమరాడ:** మండలంలోని వన్నాం గ్రామ పరిసరాల్లో ఏనుగుల గుంపు సంచరిస్తోంది. గత రెండు రోజులుగా కురుపాం మండలం కిచ్చాడ గ్రామంలో సంచరించిన ఏనుగులు బుధవారం వన్నాం పామాయిల్ తోటల్లోకి చేరాయి. రాత్రి పూట రైతుల పంట పొలాల్లోకి వెళ్లవద్దని అటవీశాఖ అధికారులు సూచించారు.


వన్నాం పరిసరాల్లో సంచరిస్తున్న గజరాజులు

## లారీ ఢీ కొని రెండు ఎద్దుల మృతి


మృతిచెందిన ఎద్దు


గాయాల పాలైన ప్రసాద్

**జామి:** మండలంలోని రామయ్యపాలెం గ్రామం నుంచి భీమసింగి సుగర్‌ఫ్యాక్టరీకి చెరకు లోడుతో వెళ్తున్న ఎడ్ల బండిని లారీ ఢీ కొనడంతో జరిగిన ప్రమాదంలో రెండు ఎడ్లు మృతిచెందడమే కాక, ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జామి నుంచి వస్తున్న లారీ పీతల పాలెం జంక్షన్ వద్ద నాటుబండిని వెనుకనుంచి ఢీకొట్టింది. దీంతో రెండు ఎడ్లు అక్కడికక్కడే మృతిచెందగా బండిపైన ఉన్న రైతు జి.ప్రసాద్ తీవ్రగాయాల పాల య్యాడు. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని 108 వాహనంలో విజయనగరం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

## శతాధిక వృద్ధురాలికి పుట్టిన రోజు వేడుక


శతాధిక వృద్ధురాలి కాళ్లు కడిగి ఆశీర్వచనం తీసుకుంటున్న కుటుంబ సభ్యులు

**రాజాం సిటీ:** పట్టణ పరిధి బుక్కావీధికి చెందిన శతాధిక వృద్ధురాలు మండాగున్న రాజమ్మ పుట్టినరోజు వేడుకను కుటుంబ సభ్యులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆమె 103 సంవత్సరాలు పూర్తిచేసుకుని 104వ సంవత్సరంలో అడుగిడుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఈ వేడుక నిర్వహించామని ఆమె మనుమడు శ్రీధర్ తెలిపాడు. ఇప్పటికీ ఆమె ఆరోగ్యంగా ఉండడంతోపాటు తన పనులు తాను చేసుకుంటున్న విషయాన్ని చూసి వేడుకకు వచ్చిన వారంతా ఆశ్చర్యచకితులయ్యారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతోపాటు వీధి వాసులు ఆమె ఆశీర్వచనం తీసుకున్నారు.

## రామనారాయణాన్ని సందర్శించిన టీటీడీ డీఈఓ

**విజయనగరం రూరల్:** విజయనగరం జిల్లా కేంద్రంలో సమీపంలోని ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) విద్యాసంస్థలు డీఈఓ భాస్కరరెడ్డి బుధవారం సందర్శించారు. రామనారాయణం ఆలయ అర్చకులు, ప్రతినిధులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం డీఈఓ, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్‌లు ఆలయాన్ని పరిశీలించి, దేవతామూర్తులకు పూజలు జరిపారు.

## రాష్ట్ర స్థాయిలో విజయం సాధించాలి

- జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్
- జిల్లా స్థాయి ఆడుదాంఆంధ్రా క్రీడా పోటీలు ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలు ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ త్రివినాగ్

**విజయనగరం:** రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో విజయనగరం జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ ఆకాంక్షించారు. ఈ మేరకు బుధవారం నగరంలోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో జిల్లాస్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. పోటీల ప్రారంభోత్సవంలో భాగంగా అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్‌తో కలిసి షటిల్ బ్యాడ్మింటన్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అంతకుముందు క్రీడాకారులతో క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సచివాలయం, మండల, నియోజకవర్గ స్థాయిల్లో జరిగిన పోటీల్లో విజేతలుగా నిలిచి జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో క్రీడా స్ఫూర్తితో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవాలని సూచించారు. జిల్లాలోని 7నియోజకవర్గాల నుంచి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో తలపడనున్నారని, విజేతలుగా నిలిచిన వారికి నగదు ప్రోత్సాహకాలు అందజేయనున్నట్లు తెలిపారు. పోటీలను పారదర్శకంగా నిర్వహించడంలో డిజిటల్ అసిస్టెంట్‌లు చిత్తశుద్ధితో వ్యవహరించాలని సూచించారు. అనంతరం ఖోఖో క్రీడలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న నరసయ్య, సురేష్‌లతో పాటు వాలీబాల్ క్రీడలో రాణిస్తున్న పి.పవన్‌కుమార్, బి.ఎర్రయ్యలను అతిథులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సెట్విజ్ సీఈఓ బి.రామగోపాల్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎ.అచ్యుత్‌కుమార్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

**లక్కవరపుకోట:** మండలంలోని కళ్లేపల్లి గ్రామం సమీపంలో తాటిచెట్లు నరుకుతుండగా వేపాడ మండలం చిన్నగుడిపాల గ్రామానికి చెందిన భోజంకి గోవింద(51) విద్యుత్ షాక్‌కు గురై బుధవారం మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోవింద వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.ఈ క్రమంలో తాటిచెట్లను నరికేందుకు కళ్లేపల్లి గ్రామం వచ్చాడు. ఇనుప నిచ్చెన వేసుకుని ఒక చెట్టు నరికి మళ్లీ వేరే చెట్టు వద్దకు నిచ్చెన తీసుకువెళ్తున్న సమయంలో పొలంలో బోరుబావికి వెళ్లే త్రీఫేస్ లైన్‌కు నిచ్చెన తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై పడిపోయాడు. గమనించిన స్థానికులు హుటాహుటిన ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ కొండబాబు తెలిపారు.

## పోలీస్ సిబ్బందికి ఆత్మీయ వీడ్కోలు


పదవీ విరమణ పొందిన వారికి ఆత్మీయ వీడ్కోలు పలుకుతున్న ఎస్పీ ఎం.దీపిక

**విజయనగరం క్రైమ్:** సుదీర్ఘ కాలం పోలీసు శాఖలో బాధ్యతాయుతంగా ఎంతో క్రమశిక్షణతో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన ట్రాఫిక్ ఎస్‌ఐ కుంచే విజయ వరప్రసాదరావు, ఏఆర్ ఎస్‌ఐ ములగపాటి వెంకటరమణలకు జిల్లా పోలీసు శాఖ తరఫున ఎస్పీ ఎం.దీపిక పోలీసు కార్యాలయంలో బుధవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో వారు చూపిన క్రమశిక్షణ, అంకితభావమే పోలీసు శాఖలో వారిని ఉన్నతంగా నిలిపిందన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ మండా జావలి అల్ఫాన్స్, విజయనగరం ట్రాఫిక్ డీఎస్పీ డి.విశ్వనాథ్, ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, ఎస్‌బీ సీఐలు కెకెవి.విజయనాథ్, ఇ.నరసింహమూర్తి, టాస్క్‌పోర్స్ సీఐ అశోక్ కుమార్, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్ని, ఉద్యోగ విరమణ చేస్తున్న ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించాలి


సమావేశంలో మాట్లాడుతున్న పతివాడ అప్పలనాయుడు తదితరులు

**పూసపాటిరేగ:** ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ ఎస్.సత్యనారాయణరాజు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కిలుగుపేట గ్రామంలో పూడి తౌడు రెడ్డి, పూడి మహేష్‌లు తమ ఇంటి ముందు వున్న ప్రభుత్వ భూమిలో తాగునీటి బోరును కప్పి ప్రహరీ నిర్మాణం చేశారని తెలిపారు. ఇంటి ముందు రస్తాను ఆక్రమించి నిర్మాణం చేయడంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే అధికారులు స్పందించి ప్రహరీ తొలిగించి, రస్తాను పునరుద్ధరించాలని కోరారు. సమావేశంలో గ్రామస్తులు దారపు గున్నారెడ్డి, దారపు అప్పలసూరెడ్డి, మహంతి శ్రీనివాసురావు, మహంతి జనార్దన రావు, గుజ్జు సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.